సాక్షి
కర్నూలు
సోమవారం ¦ 18 ¦ నవంబర్ ¦ 2024



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు ఆదివారం విజయవాడకు చెందిన డాక్టర్ వెంకటేష్ సాక్షి రూ.లక్ష విరాళం అందజేశారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా ఆదివారం కె.కృష్ణవేణి బృందం కళాకారులతో ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సుంకేసులకు స్వల్పంగా వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలతో సుంకేసుల డ్యామ్‌కు స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఆదివారం బ్యారేజీకి ఎగువ నుంచి 9,220 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ గేట్లు రెండు పైకెత్తి 6,759 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు బ్యారేజీ నుంచి శ్రీశైలానికి 339 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు జల వనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు



మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను గజ, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై కొలువుంచి శ్రీమఠం ప్రాకారంలో అశేషభక్త జన వాహిని మధ్య ఊరేగించారు. రథోత్సవంలో మేనేజర్ వెంకటేష్ జోషి అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి, అసిస్టెంట్ పీఆర్వో వ్యాసరాజాచార్, బిందుమాధవ్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో డీఐజీ దంపతులు



డీఐజీ కోయ ప్రవీణ్‌కు మెమెంటోతో అందిస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ముందుగా ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. తర్వాత డీఐజీ దంపతులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి ఆలయ ఈఓ స్వామివారి మెమొంటో అందించగా వేదపండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. డీఐజీ వెంట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అక్రమాలు దాచేస్తారు.. అవినీతిని పంచుకుంటారు!

ఉపాధి పనుల్లో టీడీపీ నేతలదే హవా...

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో టీడీపీ నేతలు హవా నడిపిస్తున్నారు. టీడీపీ నేతలు ఉపాధి సిబ్బంది కుమ్మక్కై 50 శాతంపైగా దొంగ మస్టర్లు వేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ మండలాల్లో ఉపాధి పనులను యంత్రాలతో చేపట్టి.. దొంగ మస్టర్ల ద్వారా నిధులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లోనూ అక్రమాలు భారీగా చోటు చేసుకుంటున్నాయి. ఉపాధి నిధులతో పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే వేలాది ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి జరిగినట్లు కాగితాలపై కనిపిస్తున్నా ఈ-క్రాప్‌లో మాత్రం విస్తీర్ణం పెరగడం లేదు. ప్రస్తుతం లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో టీడీపీ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.650 కోట్లతో ఉపాధి పనులు
- దారి తప్పుతున్న సోషల్ ఆడిట్ టీమ్‌లు
- సామాజిక తనిఖీలు పైపైనే
- బేరసారాలతో అవినీతి, అక్రమాలు వెలుగులోకి రాని వైనం
- అధికారులకు తెలిసినా చర్యలు శూన్యం

తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లుగా సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు ఉపాధి పనుల్లో జరిగే అవినీతి, అక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. నిధుల దుర్వినియోగంపై నిగ్గు తేల్చాల్సిన వారు కాసుల వేటలో విధులు మరిచి జేబులు నింపుకుంటున్నారు. ఉపాధి సిబ్బందితో చెట్టాపట్టాలు వేసుకుని అక్రమాలు దాచేసి.. అవినీతిలో పాలు పంచుకుంటున్నారు. పనులు తనిఖీలు చేయరు.. రికార్డులు పరిశీలించరు.. బహిరంగ విచారణ తూతూమంత్రంగా చేయడం.. అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం..ఇలా అన్నీ వెరసి సోషల్ ఆడిట్ కంచె చేను మేస్తున్నట్లుగా మారిపోయింది.

కర్నూలు(అగ్రికల్చర్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలకు హద్దే ఉండదు. ఇటు ఉపాధి సిబ్బంది.. అటు రాజకీయ నేతలు నిధులను కొల్లగొడుతున్నారు. లేబర్ రిపోర్టింగ్‌లో అన్నీ అక్రమాలే.. మెటీరియల్ కాంపోనెంటు కింద చేపట్టే పనుల్లో మొత్తం అవినీతిమయమే. ఉపాధిలో ఎక్కడ అవినీతి చోటు చేసుకున్నా... వెలికి తీయాల్సిన బాధ్యత సామాజిక తనిఖీ బృందాల (సోషల్ ఆడిట్ టీమ్స్)పై ఉంది. గతంలో సామాజిక తనిఖీలంటే ఉపాధి సిబ్బంది జడుసుకునే వారు. నేడు ఈ తనిఖీల్లో పారదర్శకతకు పాతర వేశారు . అవినీతి అక్రమాలను నిగ్గు తేల్చాల్సిన సోషల్ ఆడిట్ టీమ్ ప్రతినిధులే ఉపాధి సిబ్బందితో చేతులు కలిపి అక్రమార్జనకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధి నిధులు ఏటా రూ.650 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.350 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.300 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ నిధులు కేవలం లేబర్ కాంపోనెంటు కిందనే వెచ్చిస్తున్నారు. మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నారు. లేబర్ కాంపోనెంటు కింద చేసే ఖర్చులో దాదాపు 30 నుంచి 50 శాతం నిధులు పక్కదారి పడుతున్నాయి. కూలీలతో చేయించాల్సిన పనులను యంత్రాలతో చేసి నిధులు స్వాహా చేస్తున్నారు. మెటీరియల్ కాంపోనెంటు కింద చేపట్టే పనుల్లో అక్రమాలు అంతాఇంతా కాదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లేబర్, మెటీరియల్ కాంపోనెంటు కింద ఏటా దాదాపు రూ.900 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నా... సామాజిక తనిఖీ బృందాలు వెలికి తీస్తున్న అవినీతి అక్రమాలు ఏడాదికి రూ. రెండు కోట్లకు మించడం లేదు. అవినీతి అక్రమాలకు కేరాఫ్ ఉపాధి పనులనేది ప్రతి ఒక్కరికీ తెలిసినా సోషల్ ఆడిట్ టీమ్‌లకు మాత్రం అక్రమాలు కనిపించవు. సోషల్ ఆడిట్ టీమ్‌లే.. అతి తక్కువ నిధుల దుర్వినియోగాన్ని చూపుతుండటంతో అధికారులే ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది.

ఇలా భయపెట్టి.. అలా డ్రాప్ చేయిస్తారు!

సామాజిక తనిఖీ బృందాలు మొదట్లో కొంత ఎక్కువగానే అక్రమాలు జరిగినట్లు చూపుతారు. తర్వాత సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీవోలతో సంప్రదింపులు సాగిస్తారు. మొదట్లో చూపిన అక్రమాలు మధ్యలోనే డ్రాప్ అయిపోతాయి. నిధులు దుర్వినియోగం కాలేదని రుజువులు చూపడంతో డ్రాప్ చేస్తున్నట్లుగా వారే ప్రకటిస్తారు. అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందితో కుమ్మక్కై జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2014–19 మధ్య కాలంలో డోన్ నియోజకవర్గంలో రూ.కోట్లాది ఉపాధి నిధులు దుర్వినియోగమయ్యాయి. రూ.100 ఖర్చు చేసినట్లు చూపి రూ.80 స్వాహా చేశారు. కాని సోషల్ ఆడిట్ టీమ్‌లు వెలికి తీసింది నామమాత్రమే. నిబంధనల ప్రకారం సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి సిబ్బందితో కనీసం టీ కూడా తాగరాదు. నేడు విందు, వినోదాలతో జల్సా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆలూరులో ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

వేతనాలు లేవనే సాకుతో..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రెండేసి చొప్పున సోషల్ ఆడిట్ టీమ్‌లు పనిచేస్తున్నాయి. ఒక్కో టీములో 10 మంది సభ్యులు ఉన్నారు. సోషల్ ఆడిట్ టీమ్‌లో పనిచేసే సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు లేవు. మండలాల్లో సామాజిక తనిఖీలు చేపట్టినప్పుడు వారికి టీఏ, డీఏలు కూడా ఇవ్వాలి. అవి అందకపోవడంతో వారు అక్రమాల బాట పట్టారనే విమర్శలు ఉన్నాయి. అవినీతి, అక్రమాలను కప్పేస్తూ... జేబులు నింపుకుంటున్నారు. సోషల్ ఆడిట్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి సిబ్బంది అక్రమాల్లో చెలరేగిపోతున్నారు. అక్రమాలను గుర్తించినా.. తర్వాత డ్రాప్ చేయించుకోవచ్చనే అభిప్రాయం ఉపాధి సిబ్బందిలో ఉంది. కొన్ని చోట్ల తక్కువగా అక్రమాలు చూపినా చర్యలు మాత్రం ఉండటం లేదు. రికవరీతో సరిపెట్టేస్తున్నారు.

తనిఖీలు ఇలా చేయాలి..

- సామాజిక తనిఖీలకు జిల్లాకు రెండేసి టీమ్‌లు ఉన్నాయి. ఒక్కో టీమ్‌లో 10 మంది వరకు డీఆర్‌పీలు ఉంటారు. వీరి కింద విలేజ్ సోషల్ ఆడిటర్స్ ఉంటారు. డీఆర్‌పీలపైన ఎస్‌ఆర్‌పీ ఉంటారు.
- ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లో 99 శాతం పనులను సోషల్ ఆడిట్ టీమ్‌లు పరిశీలించి అక్రమాలను నిగ్గు తేల్చాలి. ఒక్క శాతం పనుల వరకు క్వాలిటీ కంట్రోల్ విభాగం తనిఖీ చేస్తుంది.
- ఏఏ పనులు తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలనేది గ్రామీణాభివృద్ధి శాఖ ర్యాండమ్‌గా నిర్ణయిస్తుంది. ఈ పనులు మాత్రమే క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు తనిఖీ చేస్తారు.
- గ్రామీణాభివృద్ధి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి పనులకు వెళ్లిన ప్రతి ఒక్కరినీ కలవాలి.
- వాస్తవంగా ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా కలసి ఎన్ని రోజులు పనులకు వెళ్లారు..వేతనం ఎంత వచ్చిందనే వివరాలు సేకరించాలి.
- ఒక గ్రామంలో ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు తీసుకున్న తర్వాత పగలు క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులను పరిశీలించాలి. సాయంత్రం నుంచి డోర్‌టు డోర్ వెళ్లి విచారించాలి.

కానీ ఇలా చేస్తున్నారు..

- గ్రామానికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంటు ఇచ్చే విందు స్వీకరించి ఆయనను వెంట బెట్టుకొని క్షేత్ర స్థాయికి వెళ్లి పైపైన కొలతలు వేస్తారు.
- అనుకూలంగా చెప్పే వారి ఇళ్లకు ఫీల్డ్ అసిస్టెంటు తీసుకెళ్తారు. గ్రామంలో పట్టుమని పది మందిని కూడా విచారించడం లేదు.
- కనీసం ర్యాండమ్‌గా విచారణ జరిపితే కొన్ని విషయాలు బయటికి వస్తాయి. అది కూడా లేదు.
- ఒకరిద్దరు చెప్పిందానినే గ్రామం మొత్తానికి అన్వయిస్తారు.
- నిబంధనల ప్రకారం గ్రామంలో సోషల్ ఆడిట్ నిర్వహించిన తర్వాత గ్రామసభ నిర్వహించాలి. కాని గ్రామసభలు జరుగుతున్నట్లు ఆయా గ్రామాల్లో ఎవ్వరికీ తెలియదు.
- నిజాయితీగా సోషల్ ఆడిట్ జరిగితే గ్రామాల్లో దుర్వినియోగమైన నిధుల వివరాలు వెలుగు చూస్తాయి.

నిబంధనల ప్రకారమే సోషల్ ఆడిట్



నిబంధనల ప్రకారమే సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. జిల్లాలో రెండు సోషల్ ఆడిట్ టీమ్‌లు ఉంటాయి. ఒక్కో టీమ్‌లో 10 మంది డీఆర్‌పీలు ఉంటారు. ఒక గ్రామంలో నాలుగైదు రోజులు తనిఖీలు చేపడతారు. మండలం మొత్తం పూర్తయిన తర్వాత మండల స్థాయిలో ఓపెన్ ఫోరం జరుగుతుంది. ఇందులో సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలను వివరిస్తారు. సోషల్ ఆడిట్‌లో తేలిన అక్రమాలకు సంబంధించి నిబంధనల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – నాసరరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో నాలుగవ రోజు ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. 'పుస్తకం నా నేస్తం' అనే అంశంపై కవులు, రచయితలు తమ కవితలను వినిపించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది కంప్యూటర్, ఆండ్రాయిడ్ ఫోన్‌ల వాడకానికి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్నామన్నారు. వాటిని మంచి కోసం ఉపయోగిస్తే జీవితం బాగుంటుందని, చెడు కోసం అయితే సమాజంలో తలెత్తుకోలేమని హితవు పలికారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ పెద్దక్క, తెలుగు భాష వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర కల్కూర, విశ్రాంత ఇంజినీర్లు ముచ్చుకోట చంద్రశేఖర్, కవులు, రచయితలు సుబ్బలక్ష్మమ్మ, గద్వాల సోమన్న, సయ్యద్ జహీర్ అహ్మద్, ఇనాయతుల్లా, ఆవుల బసప్ప, స్వరూప్ సిన్హా, అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా చంద్రమ్మ, నసీమా, రేణుక, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలపై రైతుల అనాసక్తి

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో శనగ విత్తనాల పంపిణీ అంతంతమాత్రంగానే ఉంది. జిల్లాకు 45,955 క్వింటాళ్లు కేటాయించగా.. ఇప్పటి వరకు 29,670 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ జరిగింది. ఈ సీజన్‌లో శనగ దాదాపు 70 వేల హెక్టార్లలో సాగు అవుతుంది. సబ్సిడీపై పంపిణీ చేసే శనగ విత్తనాల ధర ఎక్కువగా ఉండటంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. శనగ కిలో విత్తనాల పూర్తి ధర రూ.94 నిర్ణయించగా... సబ్సిడీ 25 శాతం మాత్రమే ఇచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సబ్సిడీ తగ్గించడంతో కిలో విత్తనాలకు రూ.70.50 చెల్లించాలి. మార్కెట్‌లో ఇంతకంటే తక్కువ ధరకే శనగలు లభిస్తుండటంతో రైతులు వాటిపై ఆసక్తి చూపడం లేదు. ఇప్పటి వరకు 25,557 మంది రైతులు 29,760 క్వింటాళ్ల విత్తనాలు పొందారు. 16,285 క్వింటాళ్ల శనగ విత్తనాలు మిగిలిపోయాయి.

రిజిస్ట్రేషన్లు ఢమాల్!

- కూటమి సర్కారు అనాలోచిత నిర్ణయాలు
- అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలుపుదల
- ఇదే సమయంలో పడిపోయిన రియల్‌ఎస్టేట్ వ్యాపారం
- నేలచూపు చూస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం



కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం భారీగా పడిపోయింది. కూటమి సర్కారు అధికారంలోకి రాగానే అసైన్‌మెంట్ ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలుపుదలతో పాటు మరికొన్ని అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం, ఇదే సమయంలో రియల్ ఎస్టేట్ పడిపోవడం దీనికి ప్రధాన కారణమైంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ మాసం వరకు రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్ల ద్వారా 272.29 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. అయితే సర్కారు తీరుతో రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోవడంతో ఆదాయం సగానికి పడిపోయింది. ఇప్పటి వరకు ఆ శాఖ కేవలం రూ.161.11కోట్లను ఆర్జించగలిగింది.

ప్రభుత్వ అసమర్థతే కారణం

కర్నూలు జిల్లాలో 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ క్రయ, విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఈ రూపంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.490.78 కోట్ల ఆదాయం సమకూర్చుకోవాలని ఆ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ వరకు రూ.272.29 కోట్ల ఆదాయాన్ని అర్జించేలా లక్ష్యం పెట్టకోగా సగానికి సగం కూడా ఆదాయం సమకూరలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా కూటమి సర్కారు అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేసింది. 20 ఏళ్ల తర్వాత ఈ భూముల రిజిస్ట్రేషన్ ఆగిపోవడంతో ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం నేలచూపులు చూసింది. మొదట్లో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ నెల రోజుల పాటు ఆపి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన వాటిపై విచారణ చేయాలని నిర్ణయించారు. అయితే, విచారణ ఇంతవరకు పూర్తి కాలేదు. ఇదే సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం కుప్పకూలింది. కుడా అనుమతులు లేని 80కిపైగా వెంచర్లలో రిజిస్ట్రేషన్లను నిషేధించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా అనుమతులు తీసుకోవాలని కోరితే రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతింటుదన్న కూటమి నేతలు..వారు అధికారంలోకి రాగానే అదే పనిని చేశారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, కల్లూరు, ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అత్యంత ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చి పెడతాయి. అయితే, ఇక్కడ సబ్ రిజిస్ట్రార్లను నియమించడంలో ఉన్నతాధికారులు విఫలయ్యారు. ప్రస్తుతం ఆయా కార్యాలయాలు ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నాయి. వీరు రిజిస్ట్రేషన్లపై సరిగ్గా దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కర్నూలు-బళ్లారి, హైదరాబాద్-బెంగళూరు రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే చేపడతారన్న వార్తల నేపథ్యంలో కొత్త వెంచర్లు ఏర్పాటు కాలేదు. రిజిస్ట్రేషన్ల కోసం వాడుతున్న కార్డు 2.0 ఆన్‌లైన్ వెర్షన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం ఇలా పలు కారణాలు క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

జనాల దగ్గర డబ్బులు ఖాళీ...

గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆర్థిక స్థితి గతి బాగుండేది. సంక్షేమ పథకాల అమలుతో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కాదు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. మహిళలకు వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలతో ఆర్థిక స్థోమత పెరిగేది. రైతులకు వైఎస్సార్ బీమా, రైతుభరోసా, సున్నా వడ్డీ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఏటా కనీస మంటే రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఆదాయం సమకూరేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి ప్రజల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో కుటుంబాలు గడవడమే కష్టమైన ఈ తరుణంలో భూములు, ఇళ్లు, స్థలాల విక్రయాలు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది.

వచ్చే మాసాల్లో మరింత తగ్గనున్న రిజిస్ట్రేషన్లు

ఎన్నికలకు ముందు వరకు రోజుకు జిల్లాలో 500కు పైగా వివిధ ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఇప్పుడు ఈ సంఖ్య 300కు మించడం లేదు. పరిస్థితి ఇలా ఉంటే డిసెంబర్, జనవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు ఎంత శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచాలన్న దాని పై కసరత్తు చేస్తున్నారు. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమల్లోకి వస్తే..రిజిస్ట్రేషన్ల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంది.

ఆదాయం తగ్గింది

ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం ఆశాజనకంగా లేదు. 2024– 25లో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఇందుకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించి ముందుకు వెళ్లాల్సి ఉంది. అక్టోబర్ మాసం వరకు రూ. 372.29 కోట్లకుగాను రూ. 161.11 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది.
– చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	2024–25 సంవత్సరం లక్ష్యం రూ.కోట్లలో	అక్టోబర్ వరకు లక్ష్యం రూ.కోట్లలో	సాధించిన ఆదాయం రూ.కోట్లలో
ఆదోని	56.60	31.98	19.45
ఆలూరు	12.76	7.21	6.61
ఆస్పరి	7.08	4.00	3.35
గూడూరు	17.50	9.89	6.04
కోడుమూరు	24.29	13.72	7.59
కోసిగి	12.97	7.32	4.49
పత్తికొండ	18.33	10.36	6.64
ఓర్వకల్	19.55	11.05	5.29
ఎమ్మిగనూరు	32.03	18.09	12.65
కర్నూలు	152.12	85.95	48.77
కల్లూరు	137.49	77.68	40.18
జిల్లా మొత్తం	480.78	277.29	161.11



ఆనందాల రుచులు.. వనభోజనాలు చేస్తున్న దృశ్యం



సరదాగా కాసేపు.. క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు, వారి కుటుంబీకులు

వన భోజనం.. సమైక్యతా రాగం

కార్తీక మాసం మూడో ఆదివారం సందర్భంగా అంతటా వనభోజనాల సందడి కనిపించింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కుల సంఘాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఓ వైపు ఆధ్యాత్మిక వాతావరణం, మరో వైపు ఆత్మీయ సమ్మేళన అపురూప దృశ్యాలు అందరినీ ఆహ్లాదపరిచాయి. జిల్లా రెవెన్యూ ఉద్యోగులు ఉదయాన్నే ఏడు బస్సుల్లో కలెక్టరేట్ నుంచి అలంపూర్‌కు కుటుంబసభ్యులతో తరలి వెళ్లారు. ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకుని అనంతరం విందు భోజనాన్ని స్వీకరించారు. చిన్నపిల్లలు, పెద్దలు ఆటపాటలతో, నృత్య గీతాలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నలక్ష్మీ, విశ్రాంత అదనపు జేసీ రామస్వామి, ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీరాజు పాల్గొన్నారు.
– కర్నూలు(సెంట్రల్)

చెరువు చేనాయె.. అక్రమార్కులకు వరమాయె!

- యథేచ్ఛగా వెంగళాయిదొడ్డి చెరువు ఆక్రమణ
- విస్తీర్ణం 300 ఎకరాలు – 100 ఎకరాల్లో పంటల సాగు
- కంప చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారిన గట్టు
- ఇసుక అక్రమ తరలింపుతో అడుగంటిన భూగర్భ జలాలు
- అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలం

ఆస్పరి: ఎంతో ముందుచూపుతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో పెద్దలు గ్రామాల్లో చెరువులను తవ్వించారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా చెరువులు అన్యాక్రాంతమైపోతున్నాయి. నీటితో తొణికిసలాడాల్సిన చెరువులు పంట పొలాలుగా మారుతున్నాయి. ఆస్పరి మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువుకు ఈ దుస్థితి పట్టింది. ఒక వైపు చెరువులో అక్రమంగా పంట పొలాలను సాగు చేసుకోవడమే కాకుండా, ఎక్కడబడితే అక్కడ పెద్ద పెద్ద గోతులు తీసి ఇసుకను తరలించుకుపోతున్నారు. దీంతో నీరు తాగేందుకు వెళ్లిన పశువులు గోతుల్లో పడి మృత్యువాత పడుతున్నాయి. చెరువు గట్టుపై కంపచెట్లు పెరిగి బలహీనంగా తయారైంది. ఆక్రమణలను నివారించాల్సిన మైనర్ ఇరిగేషన్, విజిలెన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. రాత్రింబవళ్లు చెరువు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల శబ్దాలతో పల్లెల జనం ఆందోళన చెందుతున్నారు. ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ఇలాగే సాగితే చెరువు మొత్తం అక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఐదు దశాబ్దాలుగా సాగునీటికి ఆధారం

వెంగళాయిదొడ్డి, కలపరి గ్రామాల మధ్యలో పెద్ద కొండలు ఉన్నాయి. ఆదోని మండలంలోని గ్రామాలలో భారీ వర్షాలు కురిస్తే వంకల ద్వారా నీరు హంద్రీలో కలిసేవి. ఈ నీటిని నిలువరించేందుకు అప్పటి అధికారులు కొండ మధ్యలో 1976లో 300 ఎకరాల విస్తీర్ణంతో చెరువును తవ్వి, 1500 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా భూములకు నీటిని అందించేవారు. చెరువు నీటితో వెంగళాయిదొడ్డి, కైరుప్పల, చెన్నంపల్లి, కారుమంచి గ్రామాలకు చెందిన 800 మంది రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు.



వెంగళాయిదొడ్డి చెరువును ఆక్రమించి సాగుచేసిన పంటలు



చెరువు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

పంట పొలాలుగా మారిన చెరువు

చెరువుకు చెందిన భూమిలో కొందరు అక్రమంగా పొలాలను సాగు చేసుకుంటున్నారు. పత్తి, జొన్న, వరి పంటలు వేస్తున్నారు. చెరువు విస్తీర్ణం 300 ఎకరాలు కాగా ఇందులో వంద ఎకరాలు ఆక్రమణకు గురైంది. పంటలు సాగు చేసిన వారు.. చెరువుకు వచ్చే నీటిని పంట పొలాల్లోకి రాకుండా 6 అడుగుల ఎత్తులో గట్లు వేసుకోవడంతో దిశ మారి కడుగొమ్ము వైపు బయటకు వృథాగా పోతున్నాయి. అలాగే చెరువులో ఇసుకను అమ్మి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అక్రమంగా సాగు చేసుకున్న భూమిలో ఇసుకను తవ్వుకునేందుకు ఎకరాకు రూ.6 లక్షల వరకు అమ్ముకుంటున్నారు. ఇదంతా తెలిసినా ఏశాఖ అధికారులు కూడా ఆక్రమణదారులను, ఇసుకను తరలిస్తున్న వారిని కట్టడి చేయకపోవడంతో భవిష్యత్‌లో చెరువు భూమి అంతా అక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.



ముళ్ల కంపతో నిండిన కుడి కాలువ

నిధులు మంజూరైతే మరమ్మతులు చేయిస్తాం

ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే చెరువుకు మరమ్మతులు చేయిస్తాం. చెరువు కుడి, ఎడమ కాలువ, గట్టుపై ఉన్న ముళ్ల కంపలను తొలగిస్తాం. చెరువును సర్వే చేయమని రెవెన్యూ అధికారులను కోరుతాం. సరిహద్దులు నిర్ణయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– రంగడు, మైనర్‌ఇరిగేషన్ ఏఈ

చెరువు నిండితేనే బోర్లలో నీరు



వెంగళాయిదొడ్డి చెరువు నిండితే ఆయకట్టు భూములకు సాగు నీరు అందించడంతో పాటు మెట్ట పొలాల్లో వేసిన బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. చెరువు కింద ఉన్న కైరుప్పల, కారుమంచి, ఆలారుదిన్నె, బనవనూరు, చెన్నంపల్లి, పుప్పాలదొడ్డి, వలగొండ, పుటుకలమర్రి, పొట్లపాడు గ్రామాలలో భూగర్భజలాలు పెరుగుతాయి. పంటలను పండించుకోవడానికి అవకాశం ఉంటుంది.

– వీరేష్, రైతు, కైరుప్పల గ్రామం

అధ్వానంగా మారిన రోడ్లు



వెంగళాయిదొడ్డి చెరువు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో ఆదోనికి తరలిస్తుండడంతో ఆ మార్గంలోని తొగలుగల్లు, దొడగొండ, బైలుపత్తికొండ, గార్లపెంట రోడ్లు గుంతలుపడి అధ్వానంగా మారాయి. రాత్రింబవళ్లు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ భారీ శబ్దాలతో నిద్ర లేకుండా చేస్తున్నారు. రోడ్లపై భారీ గుంతలు పడడంతో బైక్‌లు, ఆటోలు, ఎడ్ల బండ్లు వెళ్లేందుకు కూడా వీలులేకుండా పోయింది. ఇసుక అక్రమ తరలింపుపై మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు.

– అంజినయ్య, సర్పంచ్, తొగలుగల్లు గ్రామం

చెరువులో పంటలు సాగు చేయరాదు



చెరువులో పంటల సాగు చేపట్టరాదు. అలా చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. మైనర్ ఇరిగేషన్ వారు కోరితే చెరువును సర్వే చేయిస్తాం. అలాగే చెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకంటాం.

– శివశంకర్ నాయక్, తహసీల్దార్, ఆస్పరి

క్లుప్తంగా

21న కబడ్డీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 21వ తేదీన ఉమ్మడి జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ సెక్రటరీ పిచ్చిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీలలోపు బరువు కలిగిన వారు వయస్సుతో నిమిత్తం లేకుండా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగే 71వ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు నాగరాజు, శివలింగమయ్య, సుబ్రమణ్యం, సురేష్‌నాయుడు, నాగరాజు తెలిపారు. ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 98495 48926 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ సమీపంలో ఎల్లెల్సీ కాలువలో ఆదివారం గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యమైనట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ విలేకరులకు తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 45 సంవత్సరాలు ఉండొచ్చని, తెల్లచొక్కా, బ్లాక్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడన్నారు. పెద్దతుంబళంలోని ఎల్లెల్సీ కాలువలో ఎస్ఎస్ ట్యాంకు వద్ద శవం కొట్టుకొస్తుండగా ఎల్లెల్సీ కాలువ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

అక్రమ మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఈఎస్ టీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్: సి.బెళగల్, కృష్ణగిరి మండలాల్లో ఆదివారం కర్నూలు ఈఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, కోడుమూరు ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల మాట్లాడుతూ.. వెల్దుర్తి మండలం రత్నపల్లె చెందిన వెంకటేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.4 వేలు విలువ చేసే కర్ణాటకకు చెందిన 96 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సి.బెళగల్ మండలం కొత్తకోటకు చెందిన తెలుగు తిప్పన్నను అదుపులోకి తీసుకుని రూ.60 వేలు విలువ చేసే 294 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీఎఫ్ సీఐలు సుబాషిణి, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

- రెండిళ్లలో చోరీ
- ఒక ఇంట్లో 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు, మరో ఇంట్లో రూ.40 వేల అపహరణ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం దొంగలు హల్‌చల్ చేశారు. మనుషులు లేని సమయంలో రెండిళ్లలోకి చొరబడి చోరీలకు పాల్పడ్డారు. సురేష్ హోమ్స్‌లో నాగార్జున అనే వ్యక్తి నివాసం ఉంటున్నారు. ఆయన ఇంట్లో లేని సమయంలో దొంగలు లోనికి చొరబడి 10 తులాల బంగారం, రూ.లక్ష నగదును దొంగిలించారు. అలాగే ఉమామహేశ్వర్ నగర్‌లో వేణుగోపాల్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు పడి రూ.40 వేలను దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

పాత ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఖాళీ చేయబడిన ఆసుపత్రిలోని కంటి విభాగం, కొత్త మార్చురీ గది వద్ద మంటలు చెలరేగడంతో స్థానికులు పోలీసు, అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అక్కడ నిలిపిఉంచిన పాత 104 వాహనాన్ని తోసుకుంటూ పక్కకు తరలించడంతో మంటలు వ్యాపించకుండా నియంత్రించగలిగారు. ఈ ప్రమాదంలో కొన్ని మందులు, కోవిడ్ కిట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆసుపత్రి వర్గాలు వచ్చి పరిశీలించిన తరువాత నష్టం అంచనాలు వేస్తామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగమణి వీఆర్వోలు రామకృష్ణారెడ్డి, కైలాష్‌లను ఘటనా స్థలానికి పంపి సహాయ చర్యలు చేపట్టారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దొంగల పనేనా?

పాత ఆసుపత్రి భవనం పదినెలలుగా మూతపడి ఉంది. ఇక్కడి సామగ్రి, వైద్య పరికరాలను కొందరు ఆసుపత్రి సిబ్బంది సహకారంతో గుజిరీకి తరలించి సొమ్ము చేసుకున్నారు. సామగ్రిని ట్రాక్టర్లలో తరలిస్తున్న వీడియోలు గతంలో సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. చోరీకి గురైన పాత సామాన్ల గురించి వివరాలు తెలియకుండా ఉండేదుకే అగ్నిప్రమాదం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జడ్జి దంపతులను ఆశీర్వదిస్తున్న పండితులు

నంది క్షేత్రాల్లో జిల్లా జడ్జిలు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాలువ గ్రామంలో వెలసిన శ్రీ శివనందీశ్వర స్వామి దేవస్థానం, నల్లమల అడవిలో వెలసిన విష్ణు నందీశ్వర స్వామి దేవస్థానంను ఆదివారం కర్నూలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కబర్ధి దంపతులు, సీనియర్ సబ్ జడ్జి మల్లీశ్వరి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ ఈ.నాగప్రసాద్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం పండితులు ఆశీర్వదించారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి, ప్రోటోకాల్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా..

కర్నూలు న్యూసిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఉన్న మిత్రుడిని చూసి స్నేహితులు తల్లడిల్లిపోయారు. ఎలాగైనా అతడు కోలుకోవాలని చెయ్యిచెయ్యి కలిపి రూ.2 లక్షలు పోగుచేసి ఆదివారం బాధితుడికి అందజేశారు. వివరాలు.. సెయింట్ జోసెఫ్ ఇంటర్మీడియట్ కాలేజీ కాంట్రాక్ట్ మ్యాథ్స్ లెక్చరర్ గాంధీనాయుడు రెండు నెలల క్రితం స్వగ్రామం ముచ్చుమర్రికి వెళ్తుండగా కింద పడడంతో అతని పైనుంచి ట్రాక్టర్ వెళ్లింది. అతని నడుము కింది భాగంలో రెండు ఎముకలు విరిగాయి. రెండు నెలలుగా వైద్యం చేయించుకుంటూ మంచాన పడిఉన్నాడు. అతనితో పాటు కలిసి చదువుకున్న స్నేహితులు (శ్రీశైలం బీసీ గురుకుల పాఠశాల, 1994–95 పదో తరగతి బ్యాచ్) విషయం తెలుసుకుని.. కదలేని స్థితిలో ఉన్న మిత్రుడిని అతికష్టం మీద ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి తిరిగి నడిచేలా కృషి చేశారు. చెయ్యిచెయ్యి కలిపి సేకరించిన రూ.2 లక్షలను ఆదివారం గణేష్‌నగర్‌లోని నివాసంలో బాధితుడికి అందజేశారు. మిత్రులు డాక్టర్ శ్రీనివాసులు, టీచర్లు గిడ్డయ్య, రామాంజనేయులు, శ్రీధర్, నాగమద్దయ్య తదితరులు ఉన్నారు.



గాంధీనాయుడుకు ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

బియ్యం ధరలకు రెక్కలు

- కర్నూలు, నంద్యాల సోన రకం బియ్యం కిలో రూ.60 -65
- పన్నులు ఎత్తివేసినా రేట్లు తగ్గించని వ్యాపారులు

నంద్యాల(రూరల్): జిల్లాలో బియ్యం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. నాణ్యమైన సన్న బియ్యం (కర్నూలు, నంద్యాల సోన) కొనాలంటే కిలోకు రూ.60–65 పైగానే చెల్లించాల్సి వస్తోంది. గతేడాది పాత సన్నబియ్యం కిలోకు రూ.45 నుంచి రూ.50 లోపు లభించేవి. గత, ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 నుంచి 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గతంలో కంటే 15 నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అధికంగా సేకరణ జరిగిందని పౌరసరఫరాల అధికారులు పేర్కొంటున్నారు. డిమాండ్ కంటే ఎక్కువగా బియ్యం మార్కెట్‌కు వచ్చినా ధరలు మాత్రం తగ్గడం లేదు. ధరల నియంత్రణలో పౌర సరఫరాల అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

సన్నరకం బియ్యానికి ఆదరణ

జిల్లా పరిధిలోని మిల్లర్ల వద్ద కొన్ని వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 13 లక్షలపైగా కుటుంబాలు.. 45 లక్షల మంది జనాభా ఉన్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబం నెలకు 25 కిలోల చొప్పున బియ్యం కొంటుండగా, జిల్లాలో దాదాపు 10 లక్షల కుటుంబాలు సన్నరకం బియ్యమే వినియోగిస్తున్నారు.

పొంతన లేని ధరలు....

అధికారుల పర్యవేక్షణలో లేకపోవడంతో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌లో బియ్యం ధరలకు పొంతన ఉండటం లేదు. జిల్లా పరిధిలో 80 నుంచి 100 మంది రైసు మిల్లర్లు ఉన్నారు. ఏటా ఒక్కో మిల్లర్ వద్ద 15 నుంచి 20 టన్నుల బియ్యం నిల్వలు పెరుగుతున్నట్లు పౌరసరఫరాల శాఖ వద్ద లెక్కలు ఉన్నాయి. జిల్లాలో రోజుకు 10 నుంచి 15 వేల క్వింటాళ్ల బియ్యం వినియోగం అవుతున్నట్లు అధికారుల అంచనా. ప్రస్తుతం మిల్లర్ ధర క్వింటాల్ నంద్యాల సోన రూ.6200 – 6500, కర్నూలు సోన క్వింటాల్ రూ.5300 – 5600 పలుకుతోంది. మార్కెట్‌కు చేరిన తర్వాత రిటైల్ వ్యాపారులు చెప్పిందే ధర. ప్రస్తుతం వరి ధాన్యం ధర తక్కువగా ఉన్నప్పటికీ బియ్యం ధరలు తగ్గకపోవడం విశేషం.



మిల్లర్లు, రిటైల్ వ్యాపారుల దగా

జీఎస్టీ రాకముందు మిల్లర్లు, వ్యాపారులు ప్రతి క్వింటాల్‌పై 4 శాతం పన్ను చెల్లించేవారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులపై పన్నులను పూర్తిగా రద్దుచేశారు. అలాగే గతంలో రైస్ మిల్లర్లు వరిని ధాన్యం రూపంలో చేసి వ్యాపారులకు అమ్మితే 1 శాతం పన్ను చెల్లించేవారు. 2019 జీఓ నంబర్ 219 ద్వారా దీన్ని రద్దుచేశారు. అయినా బియ్యం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ తగ్గడం లేదు. ప్రభుత్వం సరైన రీతిలో పర్యవేక్షణ చేయని కారణంగానే వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

బాస్మతి ధరలు మరింత ప్రియం...

భాస్మతి బియ్యం ధర పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లలో బిర్యానీ ధరలను వ్యాపారులు, నిర్వాహకులు పెంచేశారు. ఒక వైపు కూరగాయలు, చికెన్, మటన్ ధరలు పెరగడం, మరోవైపు బాస్మతి ధర కూడా కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్‌టీతో పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో అన్ని రకాల ఆహార పదార్థాల ధరలు అమాంతంగా పెంచేశారు. గతేడాది నూకలు నాసిరకం బియ్యం క్వింటాలు ధర రూ.3 వేలు పలికితే ప్రస్తుతం రూ.4 వేలకు చేరిందని వ్యాపారులు అంటున్నారు. బియ్యం, నూకలు కొనేందుకు తమ దగ్గరకు వస్తున్న వినియోగదారులు ధరలను చూసి దిగాలు పడుతున్నారని, గతంలో ప్రతి నెలా 50 కిలోల బియ్యాన్ని కొనే వినియోగదారుడు ప్రస్తుతం ధర తక్కువగా ఉన్న బియ్యాన్ని తీసుకెళుతున్నారని చెబుతున్నారు. పెరిగిన అన్ని రకాల బియ్యం ధరలతో తడిసి మోపెడవుతుందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హిందూ సమ్మేళనాలను విజయవంతం చేయండి

కర్నూలు కల్చరల్: డిసెంబర్ 1వ తేదీ నుంచి జరిగే మండల హిందూ సమ్మేళనాలను విజయవంతం చేయాలని కర్నూలు జిల్లా ఆర్ఎస్ఎస్ సంఘ ప్రచారక్ సురేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు జిల్లాల్లోని రెవెన్యూ మండలాల్లో కన్వీనర్, కో–కన్వీనర్, రవాణా, మీడియా, సోషల్ మీడియా, ప్రచార సామగ్రి ప్రముఖులను నియమించుకొని ఆయా విభాగాల పనిని సమన్వయం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో విస్తృతంగా పంచాయతీ గ్రామాల సమావేశాలు నిర్వహించాలన్నారు. రవాణా కన్వీనర్‌గా భానుప్రకాష్, కో–కన్వీనర్‌గా ఈపూరి నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా గిరిబాబు, కో–కన్వీనర్‌గా శ్రీధర్, ప్రచార సామగ్రి కన్వీనర్‌గా గోవిందరాజును నియమించారు. వివిధ విభాగాల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.



వివిధ విభాగాల కన్వీనర్లతో ఆర్ఎస్ఎస్ సంఘ ప్రచారక్ సురేందర్

మామిడిని పూయిద్దాం

- పూత బాగుంటే మంచి దిగుబడులకు అవకాశం
- ఇప్పటినుంచే తగిన జాగ్రత్తలు తప్పనిసరి
- అంతర కృషి, కత్తిరింపులతో సత్ఫలితాలు
- చెట్టుకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి బాగా అందేలా చూడాలి
- జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): మామిడి తోటలకు కర్నూలు జిల్లా పెట్టింది పేరు. మరో రెండు నెలల్లో మామిడి తోటలు పూతకు రానున్నాయి. మామిడి తోటలు బాగా పూతకు రావాలన్నా.. మంచి దిగుబడులు రావాలన్నా.. రైతులు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మామిడి తోటల్లో అంతర కృషి, కత్తిరింపులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా డోన్, ప్యాపిలి, ఓర్వకల్లు, పాణ్యం, ఆళ్లగడ్డ, బనగానపల్లె, బేతంచెర్ల, వెల్దుర్తి, కృష్ణగిరి, కల్లూరు, దేవనకొండ, తగ్గలి, కర్నూలు తదితర మండలాల్లో మామిడి తోటలు 25 వేలకు పైగా ఎకరాల్లో ఉన్నాయి. గతేడాది దిగుబడులు పూర్తిగా నిరాశపరిచాయి. ఇది మళ్లీ జరగకుండా ఇప్పటినుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పూత బాగా రావడంలోనూ, అధిక దిగుబడి సాధించడంలోనూ అంతరకృషి కత్తిరింపులు కీలకపాత్ర వహిస్తాయని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు.

అంతర సేద్యం అవసరం

మామిడి తోటల యాజమాన్యంలో అంతర సేద్యం చాలా ముఖ్యం. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలాన్ని దున్నడం వల్ల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగవుతుంది. నేలలో గాలి బాగా ప్రసరించి వేర్లు బాగా పెరుగుతాయి. కలుపు మొక్కల బెడద ఉండదు. అంతేకాక నేలలో నివసించే హానికర పురుగులు నశిస్తాయి. లేత తోటల్లో చెట్లు చిన్నవిగా ఉన్నప్పుడు వరుసల మధ్య ఖాళీ స్థలం దున్ని లేదా అంతర పంటలు, పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి కలుపు రాకుండా చూడాలి. దీనివల్ల చెట్లు ఏపుగా పెరిగి తొందరగా కాపునకు వస్తాయి. కాపునకు వచ్చిన తోటల్లో తొలకరి వర్షాలకు ఒక మారు, ఆగస్టులో రెండవసారి, నవంబర్, డిసెంబర్ నెలల్లో మూడవసారి భూమిలో పదును చూసుకుని తోటను దున్నాలి. మొదటి దుక్కికి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేల కోతను నివారిస్తుంది. రెండవ దుక్కికి కలుపు నివారణ అవుతుంది. మూడవ దుక్కి పూత బాగా రావడానికి దోహదపడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగ తాలూకా కొన్ని దశలు నశిస్తాయి. దుక్కి వాలుకు అడ్డంగా దున్నాలి. తోట భూమి వాలును బట్టి ప్రతి 10–15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డుకట్టలు, కాంటూరు గట్లు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సత్తువ బయటికి కొట్టుకుపోకుండా ఉంటాయి. వేరుకుళ్లు బెడద తగ్గుతుంది. వేసవిలో చెట్లు ఎండిపోవు. పూత, కాపు బాగా ఉంటుంది.

కత్తిరింపులు

లేత మామిడి తోటల్లో మొక్కలు నా టినప్పటి నుంచి జాగ్రత్తగా కత్తిరింపులు చేస్తూ గాలి, సూర్యరశ్మి చెట్లపై బాగా ప్రసరించేటట్లు చేయాలి.



మామిడి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు (ఫైల్)

దీనివల్ల చెట్టుకు మంచి ఆకృతి వస్తుంది. నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదపడుతుంది.

- మొక్కలను 3–4 అడుగుల ఎత్తు వరకు పెరగనిచ్చి ఆ తర్వాత మూడు పక్క కొమ్మలు పెరిగేలా చూడాలి. అంతవరకు కాండంపై కొమ్మలు రాకుండా తీసివేయాలి. ఆపైన మూడు ప్రధాన కొమ్మలు ఒకేచోట పుట్టకుండా ఒక్కో కొమ్మ 9 అంగుళాల దూరం వచ్చేటట్లు చూడాలి.
- ఒక్కో ప్రథమ కొమ్మకు మూడు ద్వితీయ కొమ్మలు, ద్వితీయ కొమ్మలకు మూడు తృతీయ కొమ్మలు, తృతీయ కొమ్మలకు మూడు చతుర్థ కొమ్మలు, చతుర్థ కొమ్మలకు మూడు పంచమ దశ కొమ్మలు వచ్చే విధంగా నాటినప్పటి నుంచి కత్తరింపులు చేస్తూ పోతే చెట్టు కాపునకు వచ్చేటప్పటికి ప్రతి చెట్టులోను 243 (3X3X3X3X3) కొమ్మలు ఏర్పడుతాయి.
- కొమ్మలు ఒక పద్ధతిలో పెరగడం, నలుదిశలకు వ్యాపించడం వల్ల ఒకదాని మీద మరొకటి రానందున అడ్డు చిక్కు కొమ్మ లేర్పడనందున మంచి పంట వస్తుందని నిరూపణ అయింది.
- చిన్న మొక్కకు సరైన కత్తిరింపు సకాలంలో చేసి శిక్షణ ఇస్తే పెద్ద చెట్టు అయ్యాక మంచి ఆకారంతో పాటు నాణ్యమైన సుస్థిర దిగుబడులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

శాఖీయ పెరుగుదలను నియంత్రించాలి

గత సీజన్‌లోని కాయ తొడిమలున్న కొమ్మలను, ఎండిన కొమ్మలు, తెగులు సోకిన కొమ్మలను, నేలకు వేలాడు తున్న కొమ్మలను, జీరాడుతున్న కొమ్మలను తీసివేయాలి.

- ప్రధాన కొమ్మలపై అడ్డదిడ్డంగా పెరుగుతున్న కొమ్మలను, చిక్కు కొమ్మలను, గుబురు కొమ్మలను, తీగలా వేలాడే కొమ్మలను తొలగించాలి.
- చెట్టు లోపలికి గాలి, వెలుతురు, సూర్యరశ్మి దారాళంగా పడేలా నిటారు కొమ్మలను తూర్పు, పడమర వైపు 2.3 అంగుళాల వ్యాసం గల కొమ్మను తొలగించాలి.
- కత్తిరింపు పూర్తయ్యాక మధ్యాహ్నం వేళలో చెట్టు పాదిలో అక్కడక్కడ సూర్యరశ్మి పడాలి. కత్తిరించిన కొమ్మల మొదళ్లకు బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు పూయాలి.
- లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ (ఫైటోలాన్/బ్లైటాక్స్) 10 గ్రాముల యూరియా కత్తిరించిన చెట్లపై స్ప్రే చేయడం వల్ల కొత్త చిగుర్లు త్వరగా వస్తాయి.
- ప్రతి రెమ్మ చివర 3–5 చిగుర్లు వస్తే రెండింటిని ఉంచి మిగితా వాటిని తీసివేయాలి.